రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి స్టీల్ బ్రిడ్జి రెండో దశ రద్దు

- జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం
- బీఆర్‌ఎస్ హయాంలో రూ.426 కోట్ల ప్రాజెక్ట్

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి స్టీల్ బ్రిడ్జి రెండో దశ నిర్మాణ అనుమతులను రద్దు చేశారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ముషీరాబాద్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం దివంగత హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి హయాంలో జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి వైపు రూ.426 కోట్ల స్టీల్ బ్రిడ్జి మంజూరయ్యింది. గురువారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సదరు బ్రిడ్జి అనుమతులను రద్దు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే చర్యల్లో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి విద్యానగర్‌కు తొలి దశలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఆ మేరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తయి రాకపోకలు జరుగుతున్నాయి. రెండో దశలో రాంనగర్‌లోని గరోడ అపార్ట్‌మెంట్ నుంచి బీఈచౌరస్తా, ఇండియన్ హోమ్ ఫైప్ చౌరస్తా, సరోజినీ క్రికెట్ అకాడమీ, ఆర్టీసీ కళాభవన్ మీదుగా బాగ్‌లింగంపల్లిలోని ఎల్‌ఐజీ క్వార్టర్స్ వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మించాలని అనుమతులు ఇచ్చారు. దీంతో పాటు ఎన్టీఆర్ స్టేడియం జంక్షన్, అశోక్‌నగర్‌క్రాస్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, బాగ్‌లింగంపల్లి జంక్షన్ల వరకు నాలుగు లైన్ల దిశాత్మక ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు నిలిపివేయాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు నిర్వహించే స్టీల్ బ్రిడ్జి వల్ల తాము ఇళ్లు, ఆస్తులు కోల్పోతామని ఈ బ్రిడ్జిని నిలిపివేయాలని కోరుతూ గతంలో బాధిత ప్రజలు రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ బ్రిడ్జి నిర్మించవద్దంటూ కార్పొరేటర్ కె.రవిచారి మేయర్, కమిషనర్‌కు స్టాండింగ్ సమావేశంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, సుజాత తదితరులు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని జీహెచ్‌ఎంసీ ప్రజా సంబంధాల అధికారి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

పూనమ్ అపార్ట్‌మెంట్‌లో భారీగా వరదనీరు

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వెంకటరమణ థియేటర్ పక్కన గల పూనమ్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సెల్లార్ వరదనీటితో నిండిపోయింది. అపార్ట్‌మెంట్‌వాసులు కార్పొరేటర్ కన్నె ఉమాదేవికి ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, డీఆర్‌ఈ సిబ్బందిని పిలిపించి మోటార్లతో వర్షం నీటిని తొలగించారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నరేష్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, సూరి, రవియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు, నేలకూలిన చెట్లు

ముషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో కురిసిన భారీ వర్షానికి చెట్లు కూలాయి. మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీనితో విద్యుత్ తీగలు నేలపై వేళాడుతూ ప్రమాదంగా మారాయి. స్థానిక బీజేపీ నాయకుడు నవీన్‌గౌడ్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం విద్యుత్ శాఖ డీఈ కమల్‌కుమార్, ఏఈ సునిల్ రెడ్డి కాలనీకి వచ్చి, చర్యలు తీసుకున్నారు. చెట్లకొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలపై పడ్డ చెట్ల కొమ్మలను యంత్రాల సహాయంతో తొలగించి, సరఫరాను పునరుద్ధరించారు.

కమ్యూనిటీహాల్ కోసం హైడ్రాకు వినతి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట బస్తీవాసులకు సరైన కమ్యూనిటీహాల్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, దీంతో ఆ బస్తీప్రజల సౌకర్యార్థం బతుకమ్మకుంట స్థలంలోనే కమ్యూనిటీహాల్ నిర్మించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను బతుకమ్మకుంట వాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై పరిశీలిస్తామని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, జె.బాల్‌రాజ్, ఎస్.శేఖర్, ఆర్‌బిఐ రమేష్, కె.బాలకృష్ణ, సందీప్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



నందేవ్‌కు దళితరత్న అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

కవాడిగూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉత్సవ కమిటీ నేతలు నియమించిన షైసే నందేవ్‌కు గురువారం వివేక్‌వెంకటస్వామి దళిత రత్నఅవార్డును అందజేశారు. ఈ సందర్భంగా షైసే నందేవ్‌కు ఎమ్మెల్యేకు శాలువాకప్పి మెమొంటో అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సిటీ వైస్ ప్రెసిడెంట్ కురుమ మహేందర్, నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్, జైభీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకుడు బలవంతరావు, నాయకులు పుణ్యబాను ప్రకాష్, సుధామల అంజలి, మిద్దె లింగం తదితరులు పాల్గొన్నారు.

'ఆది హిందూ భవన్ దళితుల సొంత ఆస్తి'

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): నాడు బాల్య వివాహాలను, దేవదాసి, జోగిని వంటి దురాచారాలను నిర్మూలించడం కోసం కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డివర్మ అని జై భీమ్‌సేన ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు అని కొనియాడారు. గురువారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆది హిందూ భవన్ దళితుల సొంత ఆస్తి అని, ఈ విషయంపై దళిత సంఘాలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న వైనం ఏ మాత్రం తగదన్నారు. ఆది హిందూభవన్ సామాజిక భవనంపై ఉద్యమించడానికి అన్ని దళిత సంఘాలు సిద్ధం కావాలన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు వివిధ పనులకు కిషన్‌రెడ్డి శంకుస్థాపన

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్‌లో శుక్రవారం ఉదయం రూ.1.29 కోట్ల ప్రజాభివృద్ధిపనులకు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరు గురువారం సాయంత్రం కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. డివిజన్‌లోని గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు, అరుంధతీనగర్ బస్తీ, నీమ్‌కర్ లేన్, టీఆర్‌టీ బస్తీ దవాఖాన వెనుక వీధితోపాటు వీవీగిరినగర్ బస్తీలో నూతన మంచినీటి, సివరేజీ పైప్‌లైన్‌లను ప్రారంభిస్తారని తెలిపారు.

వాలీబాల్ గ్రౌండ్ ఆధునికీకరణకు శ్రీకారం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో వాలీబాల్ గ్రౌండ్ ఆధునికీకరణకు రూ.56లక్షలు కేటాయించామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. గురువారం వాలీబాల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వాలీబాల్‌గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్, సిట్టింగ్‌గ్యాలరీ, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్, నాయకులు పాల్గొన్నారు.



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులు

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. చిక్కడపల్లి, ముషీరాబాద్, భోలక్‌పూర్, అంబర్‌పేట, కవాడిగూడ తదితర ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ పూజలు చేశారు. చిక్కడపల్లిలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేకపూజల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయ ఈవో దేవనాథం, చైర్మన్ జానకి సుధాకర్, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ వేడుకల్లో ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొనగా, ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలో హనుమాన్ మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌యాదవ్, ఆలయ చైర్మన్ జానకి సుధాకర్

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికచింతనతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ రెనోవేషన్ కమిటీచైర్మన్ జానకి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు అంజన్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్ కుమార్‌యాదవ్, పార్టీ నేతలు శీలం సత్యనారాయణ, విడి కృష్ణ, అభిషేక్‌కెన్నడీ, ఆలయ చైర్మన్ జానకిసుధాకర్, కమిటీ సభ్యులు శ్యామ్‌కుమార్, పద్మావతి, సీతారాణి, సుబ్బారావు, వెంకట్రావ్, నిర్మల, బాలకుమార్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..



బాపూనగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న నాగభూషణంచారి తదితరులు

అంబర్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లోని బాపూనగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయాలలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. పటేల్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకపూజలు చేశారు. బాపూనగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నాగభూషణంచారి, నాయకులు యాదగిరి పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కవాడిగూడ కొత్తబజార్ సంకటవిమోచన హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

కవాడిగూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పలు హనుమాన్ దేవాలయాల్లో ఉదయం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. కవాడిగూడ కొత్తబజార్‌లోని సంకట విమోచన హనుమాన్ దేవాలయంలో జరిగిన పూజాకార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కామునికంతలోని బాలాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. దోమలగూడ హనుమాన్ దేవాలయంలో జరిగిన పూజాకార్యక్రమంలో ఆలయ ఈవో దేవనాదం, భక్తులు పూజలు చేశారు.

భోలక్‌పూర్‌లో..



మహాత్మానగర్‌లో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ముషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లోని అభయాంజనేయ స్వామి నవగ్రహ దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆంజనేయస్వామి హనుమాన్‌చాలీసాను పఠించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు శ్రీనివాస్, లక్ష్మి, శివకుమార్, నర్సింగ్‌రావు, సంతప్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు పండ్లు పంపిణీ

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి, గణపతి సచ్చిదానంద స్వామి పుట్టుపండుగ సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పేదలకు పండ్లు పంపిణీ చేశారు. సీనియర్ రాజకీయ నాయకులు రోహిత్‌కుమార్, రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ జానకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీకేలో బాలోత్సవ్ సమ్మర్ క్యాంపు ముగింపు



ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు భూపతి వెంకటేశ్వర్లు, సుజావతి తదితరులు

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారం ముగిసింది. ఈ వేడుకల్లో ఆ సంస్థ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి మాట్లాడారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో 18 రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. కాచిగూడ, నారాయణగూడ, బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, చిక్కడపల్లి, రాంనగర్, పాలమూరుబస్తీ, పద్మాకాలనీ, అంబర్‌పేట ప్రాంతాల పిల్లలు హాజరైనట్లు తెలిపారు. బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, డాన్స్ మాస్టర్ గోపాల్, మాస్టర్ వినయ్ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల తర్వాతే సీసీరోడ్లు

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న తాగు నీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థ ఆధునికీకరణ తర్వాతనే నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో ఆయా పనులు చేపట్టడంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. గురువారం నల్లకుంట డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లో రూ.19 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. నియోజకవర్గంలోని అయిదు డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించాలని, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ ఫీజులు పెంచొద్దు: ఏఐఎఫ్‌డీఎస్

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులు పెంచకుండా చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ బీ కేటగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలన్నారు. డొనేషన్ల పేరుతో లక్షలు వసూలు చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పస్కుల మట్టయ్య, మాస్ సావిత్రి, మాలోతు జబ్బార్ నాయక్, పోతుగంటి కాశీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టళ్ల బిల్లులు మంజూరు చేయాలి

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ హస్టళ్ల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎస్సీ, బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసిన ప్రభుత్వం ఎస్టీ హాస్టల్స్ బిల్లులను తిరస్కరించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

రైలులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన పూనంచంద్‌శర్మ, భార్య కోమలి(34) జైపూర్ - కాచిగూడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నారు. కామారెడ్డి రైల్వేస్టేషన్ సమీపంలో కోమలి హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో 5 గ్రాముల బంగారు ఆభరణం, రూ.8 వేలు, 2సెల్‌ఫోన్లు ఉన్నాయి. కేసును తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వేపీఎస్‌కు బదిలీ చేశారు.

'పదోన్నతులు సరిచేయడం హర్షణీయం'

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది పదోన్నతుల విషయంలో రివర్షన్‌కు గురైన గిరిజన, దళితవర్గాలకు న్యాయం చేయాలని పీజేటీఏయూ ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయూస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.బాలాజీ నాయక్ కోరారు. గతంలో జరిగిన 2 నుంచి 4 సంవత్సరాలలో విధులు నిర్వహిస్తున్న వారికి అన్యాయంగా కింది స్థాయికి మార్చి మనోవేదనకు గురిచేశారని అన్నారు. ఈ తప్పిదాన్ని గుర్తించి నిబంధనలకు అనుగుణంగా సరిచేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన సిబ్బందికి న్యాయం చేకూర్చిన ప్రస్తుత వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య, ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్.విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాల బాలికలకు నోటుపుస్తకాలు పంపిణీ



బాల బాలికలకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న హిమాయత్‌నగర్ తపాలా కార్యాలయం సబ్‌పోస్ట్ మాస్టర్ సురేష్‌గౌడ్ తదితరులు

కవాడిగూడ, మే 22 (ఆంధ్రజ్యోతి): బాల బాలికల్లో దాగిఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను వెలికి తీయడానికి వేసవి శిక్షణాశిబిరాలు దోహదపడతాయని హిమాయత్‌నగర్ తపాలా కార్యాలయం సబ్ పోస్ట్ మాస్టర్ సురేష్‌గౌడ్ అన్నారు. అప్సాలాంటి స్వచ్ఛంద సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గురువారం అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్‌లోని మునిసిపల్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమంలో ఆయన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. అనంతరం నిరుపేదబాల బాలికలకు పెన్సిల్, నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదల కోసం బాలబాలికల కోసం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంగసిస్టర్, అప్సాస్వచ్ఛంద సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ బొట్టు రమేష్, ప్రతినిధులు శ్రావణి, లావణ్య, పోస్టల్ అధికారులు విల్ ఫ్రైండ్ అరుణ్, అంగన్‌వాడీ టీచర్ సరిత పాల్గొన్నారు.

"ధన్వంతరీ' నిందితుల బెయిల్ రద్దుకు హైకోర్టును ఆశ్రయిస్తాం'

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరీ ఫౌండేషన్ నిందితుల బెయిల్ రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయిస్తామని ధన్వంతరీ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. ధన్వంతరీ ఫౌండేషన్ నిందితులు కమలాకరశర్మ, జయశ్రీ, సత్యశ్రీ, పద్మ, అనురాధలు యాంటిసిపేటరీ బెయిల్ తీసుకుని తిరిగి అదే నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కోర్టు ఇచ్చిన బెయిల్ ప్రకారం 437(3) సీఆర్‌పీసీ సెక్షన్‌ను పూర్తిగా ఉల్లంఘించారని, ఏ ఒక్క షరతును కూడా పాటించకుండా కలెక్షన్‌లు వసూలు చేస్తూ ఇన్వెస్టర్లను బెదిరిస్తూ కాల్స్ చేయడం, ప్లాట్స్ కొనమని నేరుగా మెసేజ్ వంటివి చేస్తున్నారని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన ఆరోపించారు. హైకోర్టుకు వేసవి సెలవులు పూర్తి కాగానే నిందితుల బెయిల్ రద్దుకు పిటిషన్ వేస్తామని తెలిపారు. ధన్వంతరీ నిందితులు జైలులో ఉంటేనే భయం అనేది ఉంటుందని, లేకుంటే ఇన్వెస్టర్లను ప్రభావితం చేసి మోసాలు చేస్తారని ఆరోపించారు. ఇప్పటికే ఎంతో మంది డబ్బులు కోల్పోయి మానసిక వేదనలో ఉన్నారని, ఇప్పటికే 50కిపైగా మంది చనిపోయారని పేర్కొన్నారు.



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్

ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో తిరంగా ర్యాలీ

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం సిందూర్ ఆపరేషన్ విజయవంతం సాధించిన నేపథ్యంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సైనికులకు సంఘీభావంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీని గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో నిర్వహించారు. నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ నేతృత్వంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి బర్కత్‌పుర చమాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, కేజే.బాబు, ఎంబీ.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేటలో జరిగిన తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు

భారత సైన్యానికి వందనాలతో..

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా కొనసాగిన సందర్భంగా భారత సైన్యానికి వందనాలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ గురువారం సాయంత్రం అంబర్‌పేట నియోజకవర్గంలోని అయిదు డివిజన్లలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేటలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు నాగరాజుచారి, గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, అజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, ధనుంజయ్, రాంరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లిలో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కె.రవిచారి కోరారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేసి మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ ఇతరత్ర సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు నల్లాల్లో సక్రమంగా రావడం లేదని ప్రజలు విన్నవించారు. జలమండలి మేనేజర్ జ్యోతికి ఫోన్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. బీజేపీ నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రాహుల్, టిల్లు, విజయ్, పట్వారీ పాల్గొన్నారు.